సాక్షి ఒడిశా

శుక్రవారం । 25 । జూలై । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,80,472లు,బంగారం 2 గ్రాముల 800 మిల్లీగ్రాములు, వెండి 33గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు 47 మంది ఎంపిక



పర్లాకిమిడి: గజపతి జిల్లాలో నిరుద్యోగ యువతీ యువకులు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన నానో యూనికార్న్ శిబిరంలో మొత్తం 47 మంది అర్హులైనట్టు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సౌభాగ్య స్మృతి రంజన్ త్రిపాఠి తెలియజేశారు. వీరికి లక్ష రూపాయల వడ్డీ లేని రుణం అందజేస్తారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ శిబిరానికి జిల్లా ఇండస్ట్రీస్ అధికారి సునారాం సింగ్, లీడ్ బ్యాంకు మేనేజర్ మహేశ్వర్ మండళ్ ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ప్రాథమిక ఆరోగ్యం పరిశీలన



సమస్యలు వింటున్న ఏడీఎంవో డాక్టర్ చౌదరి

రాయగడ: జిల్లాలోని గుదారి సమితి డెప్పాగుడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అదనపు ముఖ్యవైద్యాధికారి డాక్టర్ మమత చౌదరి బుధవారం పరిశీలించారు. దీనిలో భాగంగా అక్కడి గ్రామస్తులతో సమావేశమయ్యారు. గత రెండేళ్లుగా ఈ ఆరోగ్య కేంద్రంలో వైద్యుడి పోస్టు భర్తీ కాకపోవడంతో చికిత్స కోసం వస్తున్న రోగులు నానా అవస్థలు పడుతున్నారని, అదేవిధంగా ఇతరత్రా సమస్యలు కూడా ఉన్నాయని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆమె త్వరలో వైద్యుడి పోస్టు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సౌకర్యాలు అందేలా కృషి చేస్తామని హామీనిచ్చారు. అనంతరం ఆమె ఆరోగ్య కేంద్రం సిబ్బందితో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మావోయిస్టుల డంప్ స్వాధీనం



పట్టుబడిన జిలెస్టిక్స్‌తో బీఎస్ఎఫ్ జవానులు

కొరాపుట్: జిల్లాలోని జయపూర్ సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి రామగిరిలో 180వ బీఎస్ఎఫ్ బెటాలియన్ జవాన్లు మావోయిస్టుల డంప్ స్వాధీనం చేసుకున్నారు. కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో డంప్ బయట పడిందని వెల్లడించారు. గుప్తేశ్వరం పంచాయతీ శబరి నది సమీపంలో గుటాఘాట్ మీద పెద్ద రాయికింద ఈ డంప్ గుర్తించామన్నారు. దానిలో 27 జిలెస్టిక్స్ బయటపడ్డాయని పేర్కొన్నారు. వీటిని బీఎస్ఎఫ్ క్యాంప్‌కి తరలించారు. విచారణ అనంతరం బొయిపరిగుడ పోలీస్‌స్టేషన్‌కి తరలించనున్నారు.

ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు



మత్తిలి ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న చైతన్య నాయక్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి బురిడిగూడ గ్రామంలో బుధవారం రాత్రి ఎలుగు దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. బురిడిగూడ గ్రామంలో నివాసం ఉంటున్న చైతన్య నాయక్ అనే వ్యక్తికి బుధవారం రాత్రి సమీపంలోని పొలానికి వెళ్లాడు. రాత్రి 11 గంటలైనా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వైపునకు వెళ్లి చూడగా అక్కడ ఎలుగు దాడి చేయడం గమనించి వెంటనే ఆయనను మత్తిలి ఆరోగ్యకేంద్రానికి తరలించారు. గురువారం కొరాపుట్ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

భారీ వర్షాలకు కొట్టుకుపోయిన వంతెన



కొట్టుకుపోయిన తెంతులిఖుంటి కల్వర్టు

భువనేశ్వర్: పశ్చిమ ఒడిశాలో కుండపోత వర్షాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నువాపడా జిలా సునాబెడా వన్యప్రాణుల అభయారణ్యంలో వంతెన కూలిపోవడంతో కీలకమైన ఆవలి ప్రాంతంలో గ్రామీణులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా సునాబెడా పంచాయతీ కొమనా మండలం సునాబెడా, గతిబెడా గ్రామాలను కలిపే తెంతులిఖుంటి కల్వర్ట్ కొట్టుకుపోయింది. దీంతో అనేక గ్రామాల మధ్య రవాణా వ్యవస్థ కుప్పకూలింది. ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో వైద్య, అత్యవసర సేవలు దూరం కావడం పట్ల బాధిత వర్గం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ పరిస్థితి పట్ల అధికారుల స్పందన కొరవడింది. కొట్టుకుపోయిన వంతెన పునరుద్ధరణ పనులు అగమ్య గోచరంగా పరిణమిస్తున్నాయి.

మలుపు తిరగనున్న
మహానది జల వివాదం



- ఆగ్రహించిన విపక్షం
- అఖిల పక్ష సమావేశానికి ప్రతిపాదన

భువనేశ్వర్: మహా నది జలాలపై ఇరుగు పొరుగు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య వివాదం దీర్ఘకాలంగా కొనసాగుతోంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో అప్పటి బిజూ జనతా దళ్ ప్రభుత్వం ఉన్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించింది. రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థనపట్ల సానుకూలంగా స్పందించిన ఉన్నత న్యాయ స్థానం న్యూ ఢిల్లీ కేంద్రంగా మహా నది జలాల వివాద ట్రిబ్యునల్ ఏర్పాటుకు ఆదేశించింది. ఈ ట్రిబ్యునల్ అధీనంలో వివాదం విచారణ దశలో గింగుర్లు కొడుతుంది. త్వరలో ఈ కేసు విచారణ జరగనుంది. ఈ పరిస్థితుల్లో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సంప్రదింపులతో మహా నది జలాల పంపిణీ వివాదం కొలిక్కి రానుందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రకటించారు. ఈ ప్రకటన పట్ల ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రజల జీవ నాడి మహా నది. ఈ నదీ జలాలు రాష్ట్ర ప్రజల బహుముఖ జీవన శైలితో ముడిపడి ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొనసాగుతున్న న్యాయ పోరాటానికి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తెర దించి అడ్డగోలు వ్యవహారానికి నడుం బిగిస్తుందా అని విపక్ష నేత, మాజీ ముఖ్య మంత్రి నవీన్ పట్నాయక్ సూటిగా ప్రశ్నించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో మహా నది జలాల పంపిణీ వివాద పరిష్కారంపై తీర్మానం తీసుకున్నట్లు ప్రకటించారు. కేంద్రం సహాయంతో ఛత్తీస్‌గఢ్‌తో చర్చలు జరుగుతాయని, కేంద్ర జల కమిషన్ సాంకేతిక సహాయంతో దీర్ఘకాలంగా కొనసాగుతున్న వివాదానికి తెర పడుతుందని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఉభయ రాష్ట్రాల జల వనరుల విభాగం మంత్రుల మధ్య చర్చలు జరిగాయి. రెండు రాష్ట్రాల మధ్య ఉన్నత స్థాయి చర్చలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని పునరుద్ఘాటిస్తూ రాష్ట్ర అడ్వకేటు జనరల్ పీతాంబర ఆచార్య సోషల్ మీడియా ఖాతాలో సందేశం జారీ చేశారు. ఉభయ రాష్ట్రాల మధ్య పరస్పర ఒప్పందం ద్వారా సమస్యను పరిష్కరించడంపై దృష్టి కేంద్రీకరించామని వివరించారు. ఈ ప్రకటనలపై నవీన్ పట్నాయక్ కొన్ని కీలకమైన సందేహాల్ని లేవనెత్తారు. రాష్ట్ర ప్రజలకు సంతృప్తికర వివరణ ఇచ్చి తదుపరి కార్యాచరణకు ఉపక్రమించాలని హితవు పలికారు. ఏ ప్రాతిపదికన ఛత్తీస్‌గఢ్‌లోని బీజేపీ ప్రభుత్వంతో రాజీని పరిశీలిస్తున్నారో వివరించడానికి రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం అత్యవసరంగా అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

మహా నది జల వివాదాల ట్రిబ్యునల్ ముందు కేసు విచారణ ఆగస్టు 2న జరగనుంది. కీలకమైన విచారణ చేరువలో పరస్పర ఒప్పందం కోసం రాష్ట్ర ప్రభుత్వం పావులు కదపడం ప్రభుత్వం చట్టపరమైన పోరాటం నుంచి వైదొలగుతన్న సంకేతాల్ని బలపరుస్తుందని వేలెత్తి చూపారు. ఈ చర్యలు ఒడిశా నీటి హక్కులను దెబ్బతీసేలా తారసపడుతున్నాయి. వివాదస్పద పరిస్థితుల్లో ప్రభుత్వం వాటాదారులు, రాజకీయ పార్టీలు, ప్రజల విశ్వాసం కూడగట్టుకోకుండా ఛత్తీస్‌గఢ్ బీజేపీ ప్రభుత్వంతో రహస్యంగా ఒప్పందం కుదుర్చుకుంటుందా అని సందేహం లేవనెత్తారు. ఈ విషయంలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనంతో ప్రభుత్వం వ్యవహరించాలన్నారు.

అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదం చట్టం కింద ఈ వివాదంపై తీర్పు ఇవ్వాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ పూర్వాపరాలు పరిశీలించిన సుప్రీం కోర్టు 2018 సంవత్సరం జనవరి 23న కేంద్ర ప్రభుత్వాన్ని మహా నది జల వివాదాల ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించిందని నవీన్ పట్నాయక్ గుర్తుచేశారు. బీజేడీ స్థిరమైన ప్రయత్నాలు, బలమైన ప్రజా ఒత్తిడి చివరికి కేంద్ర మంత్రివర్గం ట్రిబ్యునల్ ఏర్పాటును ఆమోదించేలా చేసింది. తదనంతరం, ఈ ఆదేశాల ప్రకారం 2018 సంవత్సరం మార్చి 12న కేంద్ర ప్రభుత్వం అధికారికంగా న్యూ ఢిల్లీలో మహానది జల వివాదాల ట్రిబ్యునల్ ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేసింది. దీర్ఘకాలంగా కొనసాగిస్తున్న చట్టపరమైన పోరాటం నీరుగార్చి ప్రభుత్వం అకస్మాత్తుగా పరస్పర రాజీని అన్వేషించడం రాష్ట్ర ప్రజల ప్రగాఢ విశ్వాసాన్ని నిలువునా నీట గలిపినట్లే అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

అవిశ్వాస తీర్మానం వైపు అడుగులు

భువనేశ్వర్: రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు బిగుసుకుంటున్నాయి. తొలి సారిగా పగ్గాలు చేపట్టిన భారతీయ జనతా పార్టీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా శాంతిభద్రతలు క్షీణించి పోయాయి. ప్రధానంగా మహిళలపై అత్యాచారాలు ఇతరేతర నేరాలు నిత్యకృత్యాలుగా పరిణమించాయి. దీంతో రాష్ట్రంలో మోహన్ చరణ్ మాఝి నేతృత్వంలో ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలనే యోచనని కాంగ్రెస్ తెరపైకి తెచ్చింది. దీనిపై బీజేడీ స్పందించాలని ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ అభ్యర్థించారు. స్థానిక కాంగ్రెస్ భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఓపీసీసీ) అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మహిళలపై దారుణాలు, నేరాలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయని అన్నారు. గంజాం, బాలాసోర్, పూరీ, జగత్‌సింగ్‌పూర్ తదితర అనేక జిల్లాల్లో మహిళలపై నేరాలు జరుగుతున్నాయన్నారు. ఈ విషయమై లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సహా కాంగ్రెస్ అగ్ర నాయకులు గళం విప్పారని తెలిపారు. బాలాసోర్‌లోని ఫకీర్ మోహన్ అటానమస్ కళాశాలలో విద్యార్థిని లైంగిక వేధింపులకు బలైపోయిన విచారకర సంఘటనను సుప్రీం కోర్టు సిగ్గు చేటుగా అభివర్ణించిందని పేర్కొన్నారు.

బీజేడీ సముచితంగా వ్యవహరిస్తుంది: ఉపాధ్యక్షుడు

అవిశ్వాస తీర్మానంపై పీసీసీ అధ్యక్షుడి ప్రతిపాదనపై విపక్ష బిజూ జనతా దళ్ ఉపాధ్యక్షుడు దేవీ ప్రసాద్ మిశ్రా స్పందించారు. అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ఇప్పటి వరకు శాసన సభకు ఎలాంటి సమాచారం లేదని, బీజేడీ మహిళల కోసం నిరంతరం పోరాడుతుందని అన్నారు. రాష్ట్ర శాసన సభ ఉత్తర్వులు జారీ అయిన తర్వాత బీజేడీ సముచితంగా స్పందిస్తుందని తెలిపారు.

ప్రతిపక్షాల అవిశ్వాస తీర్మానం నిర్వీర్యం: సురేష్ కుమార్ పూజారి

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాల అవిశ్వాస తీర్మానం ప్రయాస పూర్తిగా నిర్వీర్యం అవుతుందని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి గట్టి ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రతిపాదిస్తే ప్రభుత్వానికి ఎలాంటి నష్టం జరగదని అన్నారు.

బీజేవైఎం కార్యకర్తల ఆందోళన



ఆందోళన చేస్తున్న బీజేవైఎం కార్యకర్తలు

కొరాపుట్: అధికార భారతీయ జనతా పార్టీ అనుబంధ విద్యార్థి సంస్థ భారతీయ జనతా యువజన మోర్చా కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. జయపూర్ రాజానగర్ జంక్షన్‌లో గురువారం నినాదాలు చేశారు. యువజన కాంగ్రెస్ నాయకుడు ఉదిత్‌పై లైంగిక ఆరోపణలు గుర్తు చేశారు. ఈ ఘటనపై కాంగ్రెస్ పార్టీ స్పందించాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్, రాహుల్ గాంధీ, ఉదిత్ చిత్రపటాలకు చెప్పులతో కొట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు.

మల్కన్‌గిరి జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాకు గురువారం వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. నదీ ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులు సూచించారు. మయూర్‌భంజ్, కేందుఝర్, కొరాపుట్, మల్కన్‌గిరి జిల్లాల్లో 7 నుంచి 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని జిల్లా వాతావరణ శాఖ అధికారి మున్న తురాక్ తెలిపారు.

మండీల్లో అక్రమాలపై ఫిర్యాదు



జయపురం సబ్ కలెక్టర్ కమారి శౌశ్య రెడ్డికి మెమొరాండం సమర్పిస్తున్న రైతులు

జయపురం: జయపురం సమితి జాముండ పంచాయతీలో ముత్యాలమ్మ స్వయం సహాయక గ్రూపు అక్రమాలకు పాల్పడుతోందని, వాస్తవ రైతుల నుంచి కాకుండా దళారుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తోందని జిల్లా కృషక మంచ్ రైతులు ఆరోపించారు. జిల్లా కృషక మంచ్ నేతృత్వంలో పలువురు జాముండ పంచాయతీ రైతులు గురువారం జయపురం సబ్‌కలెక్టర్ అక్కవరం శౌశ్యా రెడ్డిని కలసి ఒక మెమొరాండం సమర్పించారు. అలాగనే డీఆర్‌డీఎస్ భీమసేన్ సాహు, కలెక్టర్ వి.కీర్తి వాసన్‌లకు మెమొరాండంలు సమర్పించినట్లు తెలిపారు. జాముండ పంచాయతీలో మండీలో ధాన్యం కొనుగోలుకు, రైతులకు గుర్తింపు కార్డులను ఇచ్చే బాధ్యతను ముత్యాలమ్మ ఎస్‌హెచ్‌జీ గ్రూపునకు అప్పగించారని, ఆ గ్రూపును గ్రూపు కార్యదర్శి సుజాత పాణిగ్రహి, ఆమె భర్త బిద్యాధర కిశోర్ నిర్వహిస్తున్నారని, వారు మిగతా సభ్యులను విస్మరిస్తున్నారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక రైతులను విస్మరించి కుసుమి, పుత్ర, హాడియ, కొంగ, ఖొయిరముండ, కుములిపుట్, జయంతిగిరి ప్రాంతాల రైతుల పేర్లు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. గ్రూపు వారికి బదులుగా రైతుల గుర్తింపు, ధాన్యం కొనుగోలు బాధ్యతలను కుములిపుట్ ల్యాంప్‌నకు అప్పజెప్పాలని కోరారు.



డీఆర్‌డీఎస్ కార్యాలయంలో మెమొరాండం సమర్పిస్తున్న జిల్లా కృషక్ మంచ్ రైతులు

పాఠశాల ప్రహరీ వెనుక అస్థిపంజరం లభ్యం



లభ్యమైన అస్థి పంజరం

భువనేశ్వర్: కటక్ జిల్లా బైదేశ్వర్ పోలీస్‌స్టేషన్ పరిధి కొలాపొత్తర్ గ్రామంలోని ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ వెనుక మానవ అస్థిపంజరం గుర్తించారు. ఇది స్థానికులను భయాందోళనలకు గురిచేసింది. పాఠశాల ఆవరణకు వెలుపల ఉన్న మర్రిచెట్టు వద్ద అస్థిపంజర అవశేషాలు స్థానికుల దృష్టికి వచ్చింది. ప్లాస్టిక్ దారంతో చుట్టిన కాగితంలో కట్టి ఇక్కడ పడేసినట్లు భావిస్తున్నారు. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కాలక్రమేణా కాగితపు పొట్లాం చిరిగిపోయి పుర్రె మరియు ఎముకలు బయటపడ్డాయి. అవశేషాలను గమనించిన స్థానికులు బైదేశ్వర్ ఠాణాకు సమాచారం అందజేయడంతో పోలీసుల బృందం ఘటనా స్థలానికి చేరుకుని తదుపరి దర్యాప్తు కోసం అస్థిపంజరాన్ని స్వాధీనం చేసుకుంది. ఈ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. స్థానికులు ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అవశేషాలను శరీర నిర్మాణ అధ్యయనాల కోసం ఉపయోగించే మానవ శరీరానికి చెందినవా.. లేదా ఏదైనా దుశ్చర్య జరిగిందా అని నిర్ధారించడానికి ఫోరెన్సిక్ పరీక్షకు పంపుతామని పోలీసు అధికారులు తెలిపారు.

తప్పని ప్రసవ వేదన



గర్భిణిని నదిని దాటిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని గుదారి సమితి పెండిలి పంచాయతీలోని పంచుపాండవ గ్రామంలో నివసిస్తున్న సంతోష్ సాబొరొ భార్య జొసమంతి సాబరొ నిండు గర్భిణి. నెలలు నిండటంతో పురిటి నొప్పులతో బాధపడుతున్న ఆమెను గుదారి ఆరోగ్య కేంద్రానికి తరలించేందుకు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అయితే పంచేపాండవ గ్రామానికి రోడ్డుకు మధ్య నది ఉండటంతో అంబులెన్స్ గ్రామానికి చేరుకోలేకపోయింది. దీంతో పురిటి నొప్పులతో బాధపడుతున్న నిండు గర్భిణిని సుమారు కిలోమీటరు దూరం వరకు ఉన్న నదిని దాటిస్తూ అంబులెన్స్ వరకు చేర్పించారు. నడవలేని స్థితిలా ఉన్న ఆమెను కిలోమీటరు దూరం వరకు గల నదిని నాటించేందుకు గంట సమయం పట్టింది. ఓపికను కూడగట్టుకుని ఎంతో ప్రయాసపడి గర్భిణి అంబులెన్స్ వరకు చేరుకోగలిగింది. అనంతరం ఆమెను గుదారి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం రెండు గంటల మధ్య చోటు చేసుకుంది. ఇలాంటి తరహా సంఘటనలు జిల్లాలో తరచూ జరుగుతున్నాయి. రహదారులు లేక నానా అవస్థలు పడి గర్భిణులను నడిపించుకుని తీసుకువస్తున్నారు.

అలజడి



సియాలి ప్రాంతంలో ఎగసి పడుతున్న అలలు

భువనేశ్వర్: రాష్ట్రం తరచూ ప్రకృతి విపత్తులతో అల్లాడుతోంది. ఏటా క్రమం తప్పకుండా వరదలు, తుపాను, కరువు కాటకాలు ఏదో ఒక విపత్తు సంభవిస్తోంది. వాతావరణంలో తీవ్రమైన మార్పుల కారణంగా పిడుగుపాట్లు, అకాల వర్షాలు పెరుగుతున్నాయి. ఇవి ఇలా కొనసాగుతుండగా తీర ప్రాంతాల్లో అలల కోత వేధింపు మరింత ఉధృతం అవుతోంది. జగత్‌సింగ్‌పూర్ జిల్లాలో విస్తారమైన తీరప్రాంతాలు సముద్రపు అలల కోతకు గురవుతున్న సంఘటనలు తరచూ కనిపిస్తున్నాయి. తాజాగా గురువారం జగత్‌సింగ్‌పూర్ జిల్లా ఎరసమా మండలం సియాలి గ్రామం సమీపంలో సముద్రపు అలలు తీరంపైకి పోటెత్తాయి. 500 మీటర్ల వరకు జనావాసాల వైపు సముద్రపు ఉప్పు నీరు చొరబడింది. దీని వల్ల వ్యవసాయ భూములు ఉప్పు నీటితో మునిగిపోయాయి. పరిసర ప్రాంతాల్లో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. భద్రత కోసం గ్రామస్తులు అల్లాడుతున్నారు. చాలా నష్టం వాటిల్లిందని పీడిత వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. సముద్రం సహజ సరిహద్దును దాటి దాదాపు 500 మీటర్ల వరకు ముందుకు సాగి, సాగు చేసిన వ్యవసాయ భూములను ఉప్పు నీటితో ముంచెత్తాయి. అనేక తీరప్రాంత దుకాణాల్లోకి అలల నీరు చొరబడి నీట ముంచాయి.

ప్రభావిత తీర ప్రాంతంలో విస్తారమైన సరుగుడు తోట ఉన్నప్పటికీ శక్తివంతమైన ఉప్పెన ఎగసి పడడంతో సమీప ప్రాంతాల నివాసితులు భయం భయంగా జీవిస్తున్నారు. చాలామంది తమ ఇళ్లలోకి, తాత్కాలిక దుకాణాల్లోకి నీరు ప్రవేశించడాన్ని ప్రత్యక్షంగా చూడడంతో భయాందోళనలు మరింత పెరిగాయి. సముద్రం అకస్మాత్తుగా దూకుడుతో ఉప్పొంగడం భయానకంగా ఉంది. ఇది తరచుగా జరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభావిత తీర ప్రాంతాల్లో రక్షణ కట్టలను నిర్మించడంపై ప్రభుత్వ యంత్రాంగం మందకొడిగా వ్యవహరించడం విమర్శలకు గురవుతోంది. సముద్రపు అలల కోత నివారణకు దీర్ఘ కాలిక పరిష్కారాలను అమలు చేయాలని స్థానికులు అభ్యర్థిస్తున్నారు. ప్రధానంగా స్థానిక జిల్లా యంత్రాంగం తక్షణ చర్య తీసుకోవాలని నివాసితులు కోరారు.



తీరానికి వస్తున్న అలలు



అల కోతకు గురవుతున్న సరుగుడు చెట్లు



తీర ప్రాంతం సరుగుడు తోట గుండా చొరబడుతున్న అలల నీరు

క్లుప్తంగా

శాకంబరిగా రాజరాజేశ్వరిదేవి



రాజరాజేశ్వరిదేవి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధి ఉమారుద్ర కోటేశ్వర దేవాలయంలో రాజరాజేశ్వరీ అమ్మవారిని ఆషాఢ మాసం, మాస శివ రాత్రిని పురస్కరించుకొని గురువారం శాకంబరిగా అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో ఉదయం అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఔట్‌పోస్టు టెండర్లు ఖరారు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అగ్నిమాపక కార్యాలయాల నిర్వహణకు సంబంధించి పొందూరు, మందస ఔట్ పోస్ట్ టెండర్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం తెరిచారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో తక్కువ ఉన్న టెండర్లను ఖరారు చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక జిల్లా అధికారి జె.మోహనరావు, అటవీ శాఖ సబ్ డీఎఫ్ఓ నాగేంద్ర, అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పద్యకవితా చక్రవర్తి జాషువా



జాషువా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రచయితలు, నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: పద్య కవితా చక్రవర్తి గుర్రం జాషువా అని వక్తలు కొనియాడారు. సాహితీ స్రవంతి, శ్రీకాకుళ సాహితీ ఆధ్వర్యంలో కేంద్ర గ్రంథాలయం సమావేశ మందిరంలో గురువారం జాషువా వర్ధంతి సభ నిర్వహించారు. కథా రచయిత అట్టాడ అప్పల నాయుడు, ఆకాశవాణి కేంద్రం(విశాఖ) వ్యాఖ్యాత, రచయిత డాక్టర్ బండి సత్యనారాయణ ప్రసంగిస్తూ జాషువా ఆశయాలను, వర్తమాన స్థితిగతుల్ని వివరించారు. ముందుగా జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కథానిలయం ట్రస్టు కార్యదర్శి దాసరి రామచంద్రరావు, రచయిత చింతాడ తిరుమలరావు, తెలుగు అధ్యాపకులు బాడాన శ్యామలరావు, రచయిత కలమట దాసుబాబు, డాక్టర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం లైబ్రరీ సైన్సు విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ కె.శ్రీనివాసరావు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం సహాయ కార్యదర్శి సుధాకర్, ప్రజా సాహితీ కార్యదర్శి పి.మోహనరావు, యువ రచయితల వేదిక అధ్యక్షులు తంగి ఎర్రమ్మ, సాహితీ స్రవంతి సభ్యులు కె.భుజంగరావు, పి.దివాకర్, ఎస్.రమణారావు, భానుప్రసాద్, కె.ఉదయ్‌కిరణ్, లీలావరప్రసాద్, పొన్నాడ వరాహ నరసింహులు, కవీశ్వరరావు, సిహెచ్ రామచంద్రరావు, సన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పిన ప్రాణాపాయం



ఘటనా స్థలంలో లారీ, కారు

రణస్థలం: రణస్థలం కొత్త పెట్రోల్ బంకు సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాపాయం తప్పింది. విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న కారును వెనుకనే వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు మలుపులు తిరుగుతూ లారీ ముందుభాగంలో ఉండిపోయి కొంతదూరం ముందుకు దూసుకొచ్చింది. లారీ డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు ఎటువంటి గాయాలు కాలేదు. కారు డ్యామేజ్ అయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు.

31 మద్యం బాటిళ్లు స్వాధీనం

సారవకోట: మండల కేంద్రం సారవకోటలో వైన్‌షాపు నుంచి 31 మద్యం బాటిళ్లను తరలిస్తున్న కుమ్మరిగుంట గ్రామానికి చెందిన లక్కోజు వెంకటరావును టాస్క్‌ఫోర్స్ సిబ్బంది బుధవారం రాత్రి పట్టుకున్నారు. అనంతరం సారవకోట పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ గురువారం తెలిపారు.

'న్యాయ విచారణ కమిషన్ ఏర్పాటుకు డిమాండ్'



రాజ్ భవన్‌లో గవర్నర్‌తో సమావేశమైన రాష్ట్ర కాంగ్రెసు ప్రతినిధి బృందం

భువనేశ్వర్: రాష్ట్రంలో మహిళల రక్షణ, న్యాయం కోసం తక్షణ చర్యల్లో భాగంగా మహిళా న్యాయమూర్తి ఆధ్వర్యంలోని న్యాయ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ ఆధ్వర్యంలో 8 మిత్రపక్ష పార్టీలతో కూడిన ప్రతినిధి బృందం రాష్ట్ర గవర్నర్‌కు అభ్యర్థించింది. మహిళలపై నేరాలకు కారణాలు, వ్యవస్థాగత వైఫల్యాలను పరిశోధించి 60 రోజుల్లో కమిషన్ నివేదిక సమర్పించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరింది. ఈ ప్రతినిధి బృందం గురువారం రాజ్ భవన్‌లో గవర్నర్ డాక్టరు హరి బాబు కంభంపాటిని కలిసి సమావేశమైంది. రాష్ట్ర పాలనలో పారదర్శకతతో ప్రజా విశ్వాసాన్ని కూడగట్టేందుకు పలు సంస్థాగత సంస్కరణలు చేపట్టడం అనివార్యంగా ప్రతినిధి బృందం పేర్కొంది. పోలీస్ వ్యవస్థలో రాజకీయ జోక్యాన్ని అంతమొందించడం ప్రధానమైనదిగా తెలిపారు.

ఒడిశా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నియామకం విస్మరించిన పరిస్థితిని తొలగించి దీర్ఘకాలంగా పేరుకుపోయిన పెండింగ్ ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని ఉమ్మడి ప్రతినిధి బృందం అభ్యర్థించింది. పోలీస్ ఠాణాల్లో అత్యాచారం, లైంగిక నేరాల రికార్డుల కోసం ప్రత్యేక సెల్‌లు, ఆన్‌లైన్ ఎఫ్ఐఆర్ వ్యవస్థ, మహిళలపై క్రిమినల్ కేసులను 6 నెలల కాల పరిమితిలో పరిష్కారం, విపత్కర పరిస్థితుల్లో మహిళల తక్షణ రక్షణ కోసం టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్‌వ్యవస్థని ప్రతిపాదించారు. మహిళలపై అత్యాచారాలు వంటి నేర సంబంధిత కేసుల్లో నిందితుల వ్యతిరేకంగా శిక్ష విధింపు రేటు నామ మాత్రంగా 8.3 శాతానికి పరిమితం అయిందని, ఈ పరిస్థితిని పటిష్టపరచాల్సి ఉందన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెసు ప్రముఖులు, డాక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, సంఘ్మిత్ర జయంత్ దాస్, సురేష్ చంద్ర పాణిగ్రాహి, యుధిష్ఠర్ మహాపాత్రో, అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి రంజన్ మహాపాత్రో, నేషనలిస్టు కాంగ్రెసు పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు విక్రమ్ స్వంయి, సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి ప్రతాప్ బారిక్, రాష్ట్రీయ జనతా దళ్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి హేమంత్ కుమార్ రాష్ట్ర గవర్నరుని కలిసి వినతి పత్రం సమర్పించారు.

సీఎం దృష్టికి ఆదివాసీల సమస్యలు



సీఎంకు నివేదిక అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి, మంత్రి నిత్యానంద గోండో

కొరాపుట్: ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మజ్జికి నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి నివేదిక ఇచ్చారు. గురువారం రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో లోక్ సేవా భవన్‌లో జరిగిన 11వ ఆదివాసీ జిల్లాల సమీక్షలో ఈ నివేదిక అందించారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలపై ఆదివాసీ నేతల అభిప్రాయాలను తెలియజేశారు. ఈ నివేదిక అనుసారంగా రాష్ట్రంలో ఆదివాసీల సమస్యలపై ప్రభుత్వ పథకాలు అమలు కానున్నాయి. ఈ సమావేశంలో నబరంగ్‌పూర్ జిల్లాకి చెందిన రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి నిత్యానంద గోండో పాల్గొన్నారు.

అంధకారంలో ఆశ్రమ పాఠశాల హాస్టల్



చీకటిలో అన్నం తింటున్న బాలికలు



చీకటిలో ఉన్న బాలురు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితి కదంగూడలో ఉన్న ఆశ్రమ పాఠశాలలో చాలా కాలంగా విద్యుత్ సమస్య వేధిస్తోంది. హాస్టల్ సిబ్బంది విద్యుత్ శాఖకు ఫిర్యాదు చేస్తే.. ఏదో ఒక వైరు పెట్టి వారం రోజులు విద్యుత్ వచ్చేలా చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు విద్యుత్ సమస్య మళ్లీ మొదలైంది. బుధవారం రాత్రి విద్యార్థులు చీకటిలోనే ఉన్నారు. గురువారం కొంతమంది విద్యార్థులు మట్లాడుతూ.. తమ పాఠశాల చుట్టూ పాముల భయం ఉందన్నారు. రాత్రి సమయంలో చీకటిల్లోనే భోజనాలు చేయాల్సి వచ్చిందన్నారు. సరిగా నిద్ర పట్టడం లేదన్నారు. తమకు ఏమైనా అయితే పూర్తి బాధ్యత ఉపాధ్యాయులుదేనన్నారు. మోటారు లేక నీరు కూడా రావడంలేదని, రోజువారీ కార్యక్రమాలకు బయటకు వెళ్లాల్సి వస్తుందన్నారు. వంటవారు గ్రామంలో బోరు నీరు తెచ్చి వంట చేస్తున్నారు. విద్యుత్ సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.



కదంగూడ ఆశ్రమ పాఠశాల భవనం



చీకటిలో ఉన్న విద్యార్థులు

పచ్చని ఉద్దానాన్ని రాళ్లురప్పలతో పోల్చొద్దు



మాట్లాడుతున్న కమిటీ ప్రతినిధులు

మందస: నిత్యం పంటలతో పచ్చగా కళకళలాడే ఉద్దానాన్ని రాళ్లురప్పలతో కూడిన శంషాబాద్ ఎయిర్‌పోర్టు భూములతో పోల్చడం సరికాదని కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు అన్నారు. గురువారం మందస మండలం గంగువాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఓ టీవీ చానెల్‌తో మాట్లాడుతూ ఉద్దానాన్ని శంషాబాద్ ప్రాంతంతో పోల్చడాన్ని తీవ్రంగా ఖండించారు. అనంతరం బత్తిన లక్ష్మణ్ మాట్లాడుతూ కొబ్బరి, జీడి, పనస, మామిడి, మునగ, అరటి, జామ, నిమ్మ తదితర పంటలతో కూడిన పచ్చని నేలతల్లిని విడిచి వెళ్లిపోవాలని ఎలా అనగలుగుతున్నారని ప్రశ్నించారు.

కార్యక్రమంలో పాట్టి ధర్మారావు, ఎర్రయ్య, నారాయణ, దున్న హరికృష్ణ, శాంతారావు, శంకర్, చలపతి, సోమేశ్వరరావు, దున్న రామారావు, సంతోష్, శ్యామ్ పాల్గొన్నారు.

ఆరున్నర కేజీల గంజాయితో ఇద్దరు అరెస్టు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి బెంగళూరుకు అక్రమంగా గంజాయిని తరలించేందుకు ప్రయత్నించిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఇచ్ఛాపురం సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఇచ్ఛాపురం సర్కిల్ కార్యాలయంలో గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశాలోని గంజాం జిల్లా అస్కాకు చెందిన ప్రశాంత్‌కుమార్‌పాఢీ, బెర్హంపూర్‌కు చెందిన కందులు పూర్ణచంద్ర సెనాపతిలు అదే రాష్ట్రంలోని కందమాల్ జిల్లా టికాబలి గ్రామానికి చెందిన బఘూని డిఘాల్ వద్ద గంజాయి కొనుగోలు చేశారు. బెంగళూరులోని ఓ వ్యక్తి అందజేసేందుకు బస్సులో ఇచ్ఛాపురం చేరుకున్నారు. అక్కడి నుంచి రైల్వేస్టేషన్‌కి వస్తుండగా ఇచ్ఛాపురం పట్టణ



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మీసాల చిన్నంనాయుడు

పోలీస్‌లు తనిఖీలు చేపట్టి 6.600 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను అరెస్ట్ చేశారు. తనిఖీల్లో పట్టణ ఎస్సై ముకుందరావు, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

సురేఖా పాణిగ్రాహికి ఘనంగా నివాళి

పలాస: విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి జీవన సహచరిణి సురేఖా పాణిగ్రాహి మృతిపై సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సహాయ కార్యదర్శి వంకల మాధవరావు ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. సురేఖా పాణిగ్రాహి బొడ్డపాడులో గురువారం సాయంత్రం 3గంటలకు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలిసిన న్యూడెమొక్రసీ జిల్లా కమిటీ ఓ ప్రకటన విడుదల చేస్తూ ఆమెకు ఘనంగా సంతాపం తెలియజేస్తున్నామని పేర్కొంది. సంప్రదాయ బ్రాహ్మణ కులంలో పుట్టిన సుబ్బారావు పాణిగ్రాహి సురేఖ పాణిగ్రాహిని వివాహం చేసుకుని విప్లవోద్యమ అవసరాల కోసం బొడ్డపాడు చేరుకున్నారని గుర్తు చేశారు. భర్త ప్రజల కోసం గ్రామాల్లో ఉంటే ఆమె భర్తకు చేదోడువాదోడుగా నిలిచారని తెలిపారు. సురేఖా పాణిగ్రాహి విప్లవ స్ఫూర్తి ఆదర్శ ప్రాయమని తాండ్ర ప్రకాష్ పేర్కొన్నారు.

వితరణ..



గేటు వద్ద రోటరీ క్లబ్ సభ్యులు

కొరాపుట్: జయపూర్ రోటరీ క్లబ్ ప్రభుత్వ పాఠశాలకి వితరణ చేసింది. గురువారం పట్టణంలోని డెప్పిగుడ ప్రభుత్వ పాఠశాలలో ప్రధాన ద్వారాన్ని అందజేశారు. గేటు లేకపోవడంతో రాత్రి వేళ అసాంఘిక శక్తులకు ఈ పాఠశాల ప్రాంగణం అడ్డాగా మారింది. ఇది తెలుసుకొని క్లబ్ సభ్యులు స్టీల్ గేటు, గదులకు ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పుస్తకాలు, విద్యా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఈఓ చందన్ కుమార్ నాయక్, హెడ్ మాస్టర్ శంకరి దళపతి, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ అమర్ బుధవార్, కార్యదర్శి నారాయణ నిశాంక్, నిసాన్ పట్నాయక్, బి.శ్రీనివాసరావు, శివాజి పట్నాయక్, గణేష్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడు మృతి



అంతిమ కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేడీ నాయకులు



చెల్లూరి సూర్యనారాయణ

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని చైనా మార్కెట్ సమీపంలో వాటర్ ట్యాంక్ లైన్‌లో నివసిస్తున్న చెల్లూరి సూర్యనారాయణ (106) గురువారం వేకువజామున మృతి చెందారు. గతంలో జిల్లా కలెక్టర్లుగా వచ్చినవారు సూర్యనారాయణను కలిసి ఆరోగ్య రహస్యాన్ని అడిగేవారు. తన పని తాను చేస్తూ, దైవ చింతనలో ఎక్కువగా సూర్యనారాయణ ఉండేవారు. ఇతని మృతి వార్త విని మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని, మాజీ జెడ్పీ ప్రెసిడెంట్ మంజులా మజ్జి, డీసీసీ మాజీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠి, తదితరులు అంతిమ కార్యక్రమంలో పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు.

ఆక్రమణల తొలగింపుపై నిరసన

కొరాపుట్: జయపూర్ పట్టణంలోని పారాబెడాలో విక్రమ్ దేవ్ క్రీడా మైదానానికి ఆనుకుని బ్లాక్ ఆఫీస్ మార్గంలో ఆక్రమణల తొలగింపునకు అధికారులు గురువారం ఉపక్రమించారు. పెద్ద ఎత్తున పోలీసులు, జేసీబీలతో మున్సిపల్ సిబ్బంది తరలి వచ్చారు. తొలగింపులు ప్రారంభం కాగానే వ్యాపారుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. ముందస్తు సమాచారం లేకుండా తొలగించడంపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. పరిస్థితి ఉద్రిక్తతంగా మారడంలో అధికారులు ఆక్రమణల తొలగింపుని వాయిదా వేసి వెనుతిరిగారు.

మావోయిస్టు నేతకు మాతృవియోగం



మృతురాలు చినపిల్లమ్మ (ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: బాతుపురం గ్రామానికి చెందిన మావోయిస్టు నేత, కేంద్ర కమిటీ సభ్యులు మెట్టూరు జోగారావు అలియాస్ టెక్ శంకర్ మాతృమూర్తి మెట్టూరు చినపిల్లమ్మ (92) గురువారం మృతి చెందారు. ఆమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం సాయంత్రం కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు.

చినపిల్లమ్మకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో మూడో సంతానం జోగారావు. చినపిల్లమ్మ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆమె అంత్యక్రియలు శుక్రవారం ఉదయం అదే గ్రామంలో చేపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నర్సింగ్ విద్యార్థుల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న విద్యార్థులు

పర్లాకిమిడి: స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ నర్సింగ్ కళాశాలలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు గురువారం ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డా.మహేంద్ర కుమార్ భుయ్యాన్ విద్యార్థులతో ప్రమాణం చేయించారు. నర్సింగ్ కోర్సును వృత్తిగా స్వీకరిస్తున్న విద్యార్థులు భవిష్యత్తులో ప్రజలకు సేవ చేయాలని వైస్ ప్రిన్సిపాల్ (నర్సింగ్ స్కూల్) ప్రొఫెసర్ ఎస్.ఎస్.సంధ్య పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నర్సింగ్ స్కూల్ డైరెక్టర్ ప్రొ.సునీల్ కుమార్ ఝా, ఎస్పీ జ్యోతింద్ర కుమార్ పండా, జిల్లా మెడికల్ ఆఫీసర్ డా.శంతను పాఢి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా.అనితా పాత్రో తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు యువకులు అరెస్టు



బాధితురాలి ఫొటోలు తీసిన బొడనాయక్



ఫొటోలు వైరల్ చేసిన సత్యజిత్ సర్కార్

కొరాపుట్: నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఘటనలో ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. ఫొటోలు వైరల్ చేసిన ఘటనలో నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి డుమ్రిముండ గ్రామానికి చెందిన కల్పనా రాయ్ అనే నర్సింగ్ విద్యార్థిని విషంతాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ ఘటనలో ఆమె ఫొటోలు తీసిన ఉద్ధవ్ బొడ నాయక్‌ని జయపూర్ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు జయపూర్‌లోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతడు బాధిత యువతికి దగ్గరి బంధువు కావడం విశేషం. అందుకే ఆమె వ్యక్తిగత ఫొటోలు తీయగలిగాడని పోలీసులు అనుమానిస్తున్నారు. బొడనాయక్‌ని రాయిఘర్ పోలీసులకు అప్పగించారు. ఈ ఫొటోలు వైరల్ చేసిన సత్యజిత్ సర్కార్ తప్పించుకొని బస్సులో పారిపోయాడు. అయితే నయాగఢ్ జిల్లా దసపల్లా వద్ద రాయిఘర్ పోలీసులు మాటువేసి పట్టుకున్నారు. ఇతనిని కూడా రాయిఘర్ తీసుకొచ్చి విచారిస్తున్నారు. సత్యజిత్ ఈనెల 13వ తేదీన జయపూర్‌లో బాధితురాలిపై దాడిచేసి ముఖం మీద పిడిగుద్దులు గుద్దాడు. మరోవైపు బాధితురాలిని అధికారులు భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌కు తరలించారు. గురువారం వేకువజామున 4 గంటలకు ఆమెను ఐసీయూలో చేర్చారు. ఆమె ఎరువుల మందు తాగడం వలన పేగులు, కిడ్నీ, ఊపిరితిత్తులు బాగా దెబ్బతిన్నాయని వైద్యులు ప్రకటించారు.

గుడారి సమితి చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం



సమితి కార్యాలయం వద్ద పోలీసుల బందో బస్తు



లక్ష్మీ సొభోరో

రాయగడ: జిల్లాలోని అత్యంత ప్రాధాన్యత గల గుడారి సమితిలో రాజకీయాలు వేడెక్కాయి. సమితి చైర్‌పర్సన్ లక్ష్మీ సొభోరోపై అవిశ్వాస తీర్మానం ప్రక్రియ పూర్తయింది. ఈ మేరకు సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహట ఆదేశానుసారం గురువారం సమితి కార్యాలయంలో ఓటింగ్ జరిగింది. ఉదయం పది గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగింది. తహసీల్దార్ ఎ.స్నేహలత ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. సమితి ఈఓ ప్రసన్న కుమార్ పాడీ మేజిస్ట్రేట్‌గా వ్యవహరించారు. సమితి సభ్యులు, ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి మొత్తం 20 మంది ఓటర్లు ఉండగా.. 16 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే ఓటు వేసేందుకు హాజరు కాలేదు. పోలీసుల బందోబస్తు మధ్య ఓటింగ్ జరిగింది. ఫలితాలు వెల్లడించాల్సి ఉంది.

ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో విభజన తగదు



నిరసన తెలియజేస్తున్న వామపక్ష నేతలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను ఎవరి ప్రయోజనాల కోసం విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు చేస్తున్నారో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమాధానం చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.కృష్ణమూర్తి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం శ్రీకాకుళంలో వామపక్షాలు, ఉద్యోగ, కార్మిక, రైతు, మహిళా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపోను విభజిస్తే అనేక దళిత, పేద హమాలీ కుటుంబాలకు ఉపాధి లేకుండా పోతుందన్నారు. మంత్రి అచ్చెన్నాయుడును జిల్లా ప్రజలు శివారు భూములకు నీరు ఇమ్మని అడుగుతున్నారు తప్ప బీరు అడగడం లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వామపక్ష, వివిధ సంఘాల నాయకులు సీహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, సంతోష్, ఎం.గోవర్ధనరావు, కె.సూరయ్య, ఎల్.రామప్పడు, ఎం.రమణ, పి.సుధాకర్‌బాబు, కేదారేశ్వరరావు, ఆర్.ప్రకాష్, హమాలీ యూనియన్ నాయకులు నిడిగంట్ల రమణ, గజిని శ్రీనివాసరావు, సీతారాం, లింగాల రాము, కొంత్యాన శ్రీనివాసరావు, నవిరి సురేష్ పాల్గొన్నారు.

అచ్యుతానందన్ మృతి తీరని లోటు

రణస్థలం: కార్మిక, కర్షక, పేదల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన మహోన్నత పోరాట యోధుడు కామ్రేడ్ అచ్యుతానందన్ మరణించడం కార్మిక పోరాటాలకు తీరని లోటు అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ అన్నారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్. అచ్యుతానందన్‌కు విప్లవ జోహార్లు అర్పిస్తూ ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలసలోని శ్యాంపిస్టన్ ప్లాంట్-3 పరిశ్రమ వద్ద సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ 102 ఏళ్ల జీవన ప్రయాణంలో 85 ఏళ్ల తన జీవితాన్ని ప్రజలు, కార్మికులు కష్టజీవుల కోసం, నమ్మిన సిద్ధాంతాల కోసం వెచ్చించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎం.అశోక్, ఎల్.నాగరాజు,



అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కార్మికులు

జె.సురేష్, ఎం.సునీల్, పి.శ్రీను, కృష్ణారావు, ఎస్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



● ఒకరికి ఒకరు..!

హిరమండలం మండలం మహాలక్ష్మీపురం కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడేది. కానీ ఈ ఏడాది మాత్రం రెండో తరగతిలో సీహెచ్ శశికాంత్ అనే విద్యార్థి మాత్రమే మిగిలాడు. అతనికి నాగరాజు అనే ఏకోపాధ్యాయుడు విద్యాబోధన చేస్తున్నారు. ఇక్కడి పాఠశాలలోని 3,4,5 తరగతులను పిండ్రువాడ కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విలీనం చేశారు. దీంతో వీరిద్దరితోనే బడి నడుస్తోంది. – హిరమండలం

క్లుప్తంగా

తిరుమల సన్నిధిలో కోలగట్ల కుటుంబం



తిరుమలలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, కుటుంబ సభ్యులు

విజయనగరం: తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి కుటుంబ సమేతంగా గురువారం సందర్శించారు. కలియుగదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో మెలగాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని భగవంతుడిని ఆయన వేడుకున్నారు.

యథేచ్ఛగా పచ్చని జీడి చెట్ల నరికివేత



అనంతగిరి వద్ద వంట చెరకుగా తరలుతున్న జీడి కలప దుంగలు

భామిని: మండలంలోని పచ్చని జీడి తోటలు నేలమట్టం అవుతున్నాయి. రైతులకు ఆదాయ వనరులు కల్పించే జీడిమామిడి తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్న తరుణంలో కొందరు అక్రమార్కుల చేతిలో ఈ చెట్లు కలప దుంగలుగా మారుతున్నాయి. అనంతగిరి వద్ద జీడి తోటలను గురువారం నరికేసి అక్రమ రవాణా చేశారు. పచ్చని చెట్లు నరికివేతకు గురై వంట చెరకుగా తరలిపోతున్నాయి. వాల్టా చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. లారీలు, వ్యాన్లతో జీడి చెట్లను నరికివేసి కలప దుంగలుగా మార్చి ఇక్కడ నుంచి తరలిస్తున్నారు. మండలంలోని ఎక్కువగా బురుజోల, బిల్లుమడ గ్రామాల్లో జీడి తోటలు నేలమట్టం అవుతున్నాయి.

శివాలయంలో చోరీ



నగిరేశ్వర శివాలయంలో హుండీని పగలగొట్టిన దొంగలు

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట గ్రామంలో నగిరేశ్వర శివాలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. భక్తులు కానుకలను సమర్పించే గుడిలోని హుండీని పగులగొట్టి సుమారు పదివేల రూపాయిల వరకు నగదు, ఇతర ఆభరణాలను దొంగలు కొల్లగొట్టినట్టు ఆలయ పూజారి కొండేటి చందు గురువారం గ్రామపెద్దలకు తెలియజేశారు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా దర్యాప్తు చేపట్టారు. ఇప్పటికి ఇది మూడో సారి జరిగిన దొంగతనమని దొంగలను పట్టుకోవాలని గ్రామస్తులు పోలీసులను కోరారు. మరోమారు పునరావృతం కాకుండా పోలీసులు గట్టి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, భక్తులు పోలీసులను కోరారు.

సెల్‌ఫోన్ల దొంగ అరెస్టు



జీఆర్పీ పోలీసులకు పట్టుబడిన సెల్‌ఫోన్ దొంగ

విజయనగరం క్రైమ్ : విజయనగరం రైల్వే పోలీసులు సెల్‌ఫోన్ల దొంగను గురువారం అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి జీఆర్పీ ఎస్‌ఐ బాలాజీరావు మాట్లాడుతూ ఆర్‌పీఎఫ్ సిబ్బందితో రైల్వే ప్లాట్‌ఫాంలపై తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి పట్టుబడ్డారన్నారు. పట్టుకుని విచారిస్తే ఆ వ్యక్తి వద్ద నాలుగు సెల్‌ఫోన్లు ఉండటంతో తమదైన రీతిలో విచారించారు. దీంతో రైళ్ల కోసం వేచి ఉన్న ప్రయాణికుల నుంచి సెల్‌ఫోన్లను దొంగలించానని ఒప్పుకున్నట్టు తెలిపారు. నిందితుడి నుంచి రూ.లక్ష విలువ గల నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం విశాఖపట్నం రైల్వే కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్‌ఐ తెలిపారు.

పీ-4 సర్వేను వేగవంతం చేస్తాం

పార్వతీపురం రూరల్: జిల్లాకు సంబంధించి పీ-4 సర్వేను వేగవంతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం వివరించారు. జిల్లాల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మన్యం జిల్లాలోని బంగారు కుటుంబాల్లో దాదాపు 50 శాతం సర్వే పూర్తయిందన్నారు. గ్రామ సభలు నిర్వహిస్తున్నామని, మరింత వేగవంతం చేస్తామని తెలియజేశారు.

యూనానికి స్వీపరే దిక్కు..!

- ఏళ్ల తరబడి వైద్యుడిని నియమించని ప్రభుత్వం
- కాంపౌండర్‌ని కూడా బదిలీ చేసిన వైనం
- జిల్లా కేంద్రంలో వైద్య సిబ్బంది లేని దుస్థితి
- చికిత్స కోసం వచ్చిన రోగులు వెనుతిరిగి వెళ్లిపోతున్న వైనం



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో యునాని విభాగం

విజయనగరం ఫోర్ట్: ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని గొప్పలు చెబుతున్న కూటమి సర్కార్ మాటలు ప్రకటనలకే తప్ప అమలుకు నోచుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వైద్య సేవలు అందక రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఆయుష్ శాఖలో భాగమైన యునాని విభాగానికి స్వీపరే దిక్కు అయ్యారు. వైద్యులు, కాంపౌండర్ లేకపోవడం వల్ల ఈ విభాగానికి వైద్య సేవలు కోసం వచ్చే వారు వెనుతిరుగుతున్నారు. యునానీలో కొన్ని రకాల సమస్యలకు మంచి చికిత్స ఉంది. దీంతో ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి చికిత్స కోసం వచ్చే రోగులకు చికిత్స అందని పరిస్థితి నెలకొంది.

వైద్యున్ని నియమించని ప్రభుత్వం

యునాని విభాగానికి ప్రభుత్వం వైద్యున్ని నియమించలేదు. ఇక్కడ పని చేసే కాంపౌండర్‌ను వేరే చోటకు బదిలీ చేశారు. వైద్యుడు, కాంపౌండర్ రెండు పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ప్రభుత్వం భర్తీ చేయలేదు. పోనీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిందంటే అదీ లేదు. దీంతో స్వీపర్ కమ్ స్కేవంజర్(ఎస్‌సీఎస్) పెద్ద దిక్కుగా నిలిచారు. వైద్యుడు, కాంపౌండర్ లేనప్పటికీ ప్రతీ రోజు యునాని డిస్పెన్సరీలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటున్నారు.

మందులు ఉన్నా అందించే దిక్కులేదు

యునానీలో చర్మ సంబంధిత సమస్యలు (బొల్లి మచ్చలు, తదితర వాటికి) కీళ్ల నొప్పులకు, దగ్గు, జలుబు, జ్వరం, గ్యాస్ట్రిక్, స్త్రీల వ్యాధులకు మంచి మందులు ఉన్నాయి. అయినప్పటికీ వీటిని అందించే నాధుడే కరువయ్యాడు. యునాని వైద్యం గురించి తెలిసిన రోగులు ప్రతీ రోజు వస్తుంటారు. అయితే చికిత్స అందించే వారు లేక పోవడం వల్ల వారు వెళ్లిపోతున్నారు.



విధులు నిర్వహిస్తున్న స్వీపర్ కమ్ స్కావెంజర్

జిల్లా కేంద్రంలో వైద్య సిబ్బంది కరవు

జిల్లా ప్రధాన కేంద్రంలోని యునాని డిస్పెన్సరీకి వైద్య సిబ్బంది లేని దుస్థితి నెలకొంది. యూనాని డిస్పెన్సరీ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణంలో ఉంది. దీంతో రోగులు వస్తారు. జిల్లా కేంద్రంలో వైద్య సిబ్బందిని నియమించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



యునాని మందులు

వాస్తవమే..

విజయనగరం యునాని విభాగానికి వైద్యుడు, కాంపౌండర్ లేని మాట వాస్తవమే. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉంది.
– డాక్టర్ ఝాన్సీలక్ష్మి, ఆర్‌డీడీ, ఆయుష్ శాఖ

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

విజయనగరం క్రైమ్ : నగరంలోని పోలీసు కార్యాలయానికి సమీపంలో ఉన్న కంటోన్మెంట్ సమీపంలో ఉన్న ఓ బిర్యానీ పాయింట్ వద్ద ఇద్దరు వ్యక్తుల మధ్య గురువారం సాయంత్రం ఘర్షణ జరిగింది. ఇది కాస్త కొట్లాటకు దారితీసింది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. బిర్యానీ పాయింట్ వద్ద ఉమర్, నజీర్ అనే వ్యక్తుల మధ్య మసీదు అభివృద్ధి విషయమై వివాదం తలెత్తింది. అది కాస్త వారిద్దరి మధ్య కొట్లాటకు దారితీసింది. విషయం కంట్రోల్ రూమ్‌కు తెలియడంతో విజయనగరం వన్‌టౌన్ సీఐ ఆర్‌వీకే చౌదరి, ఎస్‌ఐలు రామ్‌గణేష్, లక్ష్మీప్రసన్నకుమార్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన ఇద్దరినీ విజయనగరం సర్వజన ఆసుపత్రిలో చేర్పించారు.



బిర్యానీ పాయింట్ వద్ద పోలీసు బందోబస్తు

ఈ వివాదం నేపథ్యంలో బిర్యానీ పాయింట్ వద్ద, మసీదు వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

27న టీచర్ పోస్టులకు పరీక్ష

విజయనగరం అర్బన్: పట్టణంలోని సెయింటాన్స్ బాలికల ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న రెండు ఎస్‌జీటీ పోస్టుల ఎంపిక పరీక్షను ఈ నెల 27న స్థానిక గురజాడ స్కూల్‌లో నిర్వహిస్తామని డీఈవో యు.మాణిక్యంనాయుడు గురువారం తెలిపారు. ఆ పోస్టులకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆ రోజు ఉదయం 11 నుంచి 12.30 గంటల మధ్య జరిగే పరీక్షకు హాజరు కావాలని పేర్కొన్నారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందు హాజరు కావాలని సూచించారు. హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒక ఫొటో గుర్తింపు కార్డు (ఆధార్/డ్రైవింగ్ లైసెన్స్/ఓటర్ ఐడీ)ను తీసుకు రావాలని సూచించారు.

పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలు వేగవంతం కావాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



కన్నయ్యగూడలో పీఎం జన్‌మన్ గృహ లబ్ధిదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

గుమ్మలక్ష్మీపురం: జిల్లాలో పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలు వేగవంతం కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ గృహ నిర్మాణ శాఖ అధికారులు, లబ్ధిదారులకు సూచించారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని కన్నయ్యగూడ, కురుపాం మండలంలోని తోటగూడ గ్రామాల్లోని పీఎం జన్‌మన్ ఇళ్లను గురువారం ఆయన పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. బిల్లుల చెల్లింపులపై లబ్ధిదారులతో మాట్లాడారు. కన్నయ్యగూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీ స్కూల్‌ను పరిశీలించారు. పాఠశాలకు అదనపు తరగతి గది మంజూరు చేస్తామన్నారు. అలాగే భద్రగిరి సీహెచ్‌సీని సందర్శించి వైద్యులకు పలు సూచనలు చేశారు. నిర్మాణ దశలో ఉన్న ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. ఆపై గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ గరల్స్ స్కూల్‌ను సందర్శించి మార్గదర్శకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకర్లతో మాట్లాడుతూ పీఎం జన్‌మన్ కింద జిల్లాకు 5వేల గృహాలు మంజూరు కాగా, 1600 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని, 130 గృహాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన గృహాలు డిసెంబర్ నెలాఖరులోగా పూర్తికావాల్సి ఉందన్నారు. అందులో భాగంగానే క్షేత్ర స్థాయి సమస్యలను తెలుసుకునేందుకు పర్యటించినట్టు చెప్పారు. భద్రగిరి సీహెచ్‌సీలో సీజనల్ వ్యాధులు, వైరల్ ఫీవర్స్ ఎక్కువగా నమోదవుతున్న తరుణంలో బెడ్లు సరిపోవడం లేదని, నిర్మాణ దశలో ఉన్న కొత్త ఆసుపత్రి భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించినట్టు తెలిపారు. బంగాళాఖాతంలో నెలకొన్న అల్పపీడనం వలన కలిగే తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు రెవెన్యూ, పోలీస్‌ల సహకారంతో ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు గ్రామ సచివాలయం ఏఎన్‌ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూలతో వైద్య సేవలందించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట కేఆర్‌ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ డా.పి.ధర్మ చంద్రారెడ్డి, ఐసీడీఎస్ పీడీ టి.కనక దుర్గ, ఐటీడీఏ డీడీ ఆర్.కృష్ణవేణి, గుమ్మలక్ష్మీపురం ఎంపీడీవో పి.త్రివిక్రమరావు, తహసీల్దార్ ఎన్.శేఖర్, ఎంఈవో బి.చంద్రశేఖర్, హౌసింగ్ డీఈ ఎం.వెంకటరావు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన శాసపు రమణ (59) మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. రమణ రాజాంలోని శ్రీకాకుళం రోడ్డులో గ్యాస్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే ఉదయం 7.30గంటల సమయంలో విధులకు టీవీఎస్ ఎక్సెల్‌పై బయలుదేరాడు. పొగిరి పీహెచ్‌సీ ఎదురుగా వచ్చేసరికి కళ్లు తిరగడంతో బైక్ అదుపుతప్పి ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. అక్కడ నుంచి 108 సహాయంతో రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని చెప్పడంతో కుటుంబ పెద్దను కోల్పోయామని, తమకెవరు దిక్కని కుటుంబీకులు రోదించారు. మృతునికి భార్య సీతమ్మ, కుమారుడు చిరంజీవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని కుమారుడు చిరంజీవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు.



ప్రమాదంలో మృతి చెందిన రమణ

కేరళలో కోన యువకుడు ఆత్మహత్య

మక్కువ:

మండలంలోని కోన గ్రామానికి చెందిన మడక గోవర్ధనరావు(30) కేరళ రాష్ట్రంలో గురువారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు..గోవర్ధనరావు కేరళ రాష్ట్రంలోని కాసరగోడ్ జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఏమైందో తెలియదుగాని తాను అద్దెకుంటున్న గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. గోవర్ధనరావు మృతి చెందాడన్న వార్త తెలిసిన తల్లిదండ్రులు రామకృష్ణ, చిన్నమ్మలు కన్నీరుమున్నీరయ్యారు.

ఈగల్ టీమ్‌కు చిక్కిన గంజాయి నిందితులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ, వెనుక ముసుగులో నిందితులు

- పట్టుబడిన వారిలో యూపీకి చెందిన దంపతులు

విజయనగరం క్రైమ్ : మూడు కార్లలో 120 కేజీల గంజాయిని రవాణా చేస్తున్న ఎనిమిది మందిని రాజాపులోవ జంక్షన్ వద్ద ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో పట్టుకున్నట్టు ఎస్పీ వకుల్ జిందల్ వెల్లడించారు. డీపీవోలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈగల్ టీమ్ సీఐ కల్యాణితో కలిసి వివరాలు వెల్లడించారు. ఈగల్ పోలీసులకు అందిన కచ్చితమైన సమాచారంతో విజయనగరం నుంచి మూడు కార్లలో వస్తున్న ఎనిమిది మందిని రాజాపులోవ వద్ద అదుపులోకి తీసుకొని వారి నుంచి 47 ప్యాకెట్లలో ఉన్న 120 కేజీల గంజాయిని, తొమ్మిది సెల్‌ఫోన్లను సీజ్ చేశామన్నారు. పట్టుబడిన ఎనిమిది మంది నిందితుల్లో ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా లంతాపూర్ బ్లాక్ బెల్ట్‌కు చెందిన కొర్రా కిరణ్(21), మనోజ్ బిసాయి(2), ఢిల్లీలోని పాత సీంపూర్‌కు చెందిన పాజిల్(30), యూపీలోని హాపూర్ జిల్లా లక్ష్మణపురకు చెందిన బిజేంద్ర(46), బుదాన్ జిల్లా సక్రి జంగిల్‌కు చెందిన ముఖ్తర్ అహ్మద్(43), అహిర్వారాకు చెందిన రామ్మోహన్(21), కాశగాని జిల్లా కుల్లికి చెందిన సోను (34), శిల్పి(30)గా విచారణలో గుర్తించామన్నారు. నిందితులు గంజాయిని ఉత్తరప్రదేశ్, ఢిల్లీకు రవాణా చేయాలనే ఉద్దేశంతో ఒడిశా రాష్ట్రంకు చెందిన గంజాయి వ్యాపారులతో సంబంధాలు పెట్టుకున్నారని తెలిపారు. మరో నిందితుడు అజిత దడక అలియాస్ ఒజి అలియాస్ మహేష్ దడక పరారయ్యాడని, త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. వీరంతా ఒడిశాలోని గంజాయి వ్యాపారుల వద్ద కొనుగోలు చేసి రైళ్లు, కార్లలో తరలించేందుకు ప్రణాళిక రూపొందించుకున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో కార్లలో విజయనగరం మీదుగా విశాఖపట్నం తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారన్నారు. వీరిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గంజాయిని పట్టుకోవడంలో చురుగ్గా వ్యవహరించిన భోగాపురం సీఐ కె.దుర్గాప్రసాద్, ఈగల్ సీఐ టి.కల్యాణి, ఎస్‌ఐ పి.పాపారావు, ఇతర పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఆయనతో పాటు డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు పోలీసు అధికారులు ఉన్నారు.

రామతీర్థంలో పునర్వసు పట్టాభిషేకం

- సీతారామస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పునర్వసు పట్టాభిషేక మహోత్సవాన్ని ఆలయ అర్చకులు గురువారం వైభవంగా జరిపించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరకాండ హవన హోమం జరిపించారు. అనంతరం స్వామి వెండి మండపంలో సీతారామస్వామి కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా జరిపించి.. ఉత్సవ మూర్తులకు రామాయణంలో పట్టాభిషేకం సర్గ విన్నవించారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి వివిధ రకాల ఫల రసాలతో అభిషేకం, పునర్వసు పట్టాభిషేకాన్ని జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, వరప్రసాద్, పవన్, రామగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



స్వామి సన్నిధిలో పట్టాభిషేక పూజలు జరిపిస్తున్న అర్చకులు

సాగు భూమిని ఏపీఐఐసీకి ఎలా కేటాయిస్తారు..!



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అజురఫీజాన్

- తహసీల్దార్‌ను ప్రశ్నించిన కాకర్లవలస గిరిజన రైతులు
- పట్టా లేకుండా సాగు చేసే హక్కు లేదు..
- వదిలి వెళ్లిపోవాలని తేల్చి చెప్పిన తహసీల్దార్

రామభద్రపురం:

డి పట్టా భూమి అయిన.. దశాబ్దాల కాలంగా మా సాగులో ఉన్న భూమిని ఏపీఐఐసీకి ఎలా కేటాయిస్తారని కాకర్లవలస గిరిజన రైతులు తహసీల్దార్ అజురఫిజాన్‌ను ప్రశ్నించారు. మండలంలోని కొట్టక్కి రెవెన్యూ, మిర్తివలస పంచాయతీ పరిధిలోని కాకర్లవలస, కారేడువలస గ్రామాల మధ్య 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సుమారు 187.08 ఎకరాల భూమిని రూ.7.48 కోట్లకు ఏపీఐఐసీకి విక్రయించింది. అయితే ఆ భూమిలో ఏపీఐఐసీ ఇప్పటి వరకు కనీసం ఒక్క పరిశ్రమ పెట్టలేదు సరికదా, భూమి ఎక్కడుందో? ఎలా ఉందో, ఎవరు ఆక్రమించుకున్నారో.. కనీసం కన్నెత్తి చూడలేదు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏపీఐఐసీకి సంబంధించిన భూమిలో ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు కోసం కొంత భూమిని కేటాయిస్తూ ముందుగా రోడ్లు అభివృద్ధి కోసం రూ.7 కోట్లు నిధులు విడుదల చేయడంతో నెల రోజుల క్రితం మంత్రి కొడపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బేబీనాయన, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శంకుస్థాపన కూడా చేసిన విషయం విదితమే. అయితే సంబంధిత కాంట్రాక్టర్ ఇప్పుడు రోడ్లు అభివృద్ధి కోసం పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో ఏపీఐఐసీకి సంబంధించిన భూమే కదా అని ప్రస్తుతం సాగులో ఉంటూ పత్తి, మొక్కజొన్న, మామిడి, జీడి తోటలు సాగు చేస్తున్న గిరిజన రైతులకు కనీసం నోటీసు ఇవ్వకుండా జేసీబీతో ధ్వంసం చేశారు. దాంతో తమ సాగులో ఉన్న భూములలో ఎలా రోడ్లు వేస్తారని వారు ప్రశ్నించారు. ఈ క్రమంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అజూరఫీజాన్ ఆధ్వర్యంలో ఏపీఐఐసీ జేఈ రాజేష్‌కుమార్, ఎస్‌ఐ వి.ప్రసాదరావు, మిర్తివలస సర్పంచ్ మజ్జి రాంబాబు, సీపీఎం నాయకుడు బలస శ్రీనివాసరావు, గిరిజన రైతులు సమావేశమయ్యారు. సమావేశంలో భూ రికార్డులు పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కాకర్లవలసలో ఉన్న మొత్తం సుమారు 462 ఎకరాల డి పట్టాతో పాటు, ఫారెస్టుకు సంబంధించిన భూమి ఉందని, అందులో గిరిజన రైతులకు 266 ఎకరాల భూమి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు కింద ఇచ్చామన్నారు. అలాగే 187.8 ఎకరాలు రూ.7.48 కోట్లకు ఏపీఐఐసీకి విక్రయించిందన్నారు. కొండ పక్కన ఉన్న ప్రాంతంలో మీకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఇస్తే ఏపీఐఐసీకి కేటాయించిన భూమిలో మీరు ఎలా సాగు చేస్తారని? ఇది డి పట్టా భూమి అని మీరు సాగు చేస్తే కుదరదని, వదిలి వెళ్లిపోవల్సిందేనని తేల్చి చెప్పేశారు. భూమి ఎక్కడ ఇచ్చారో అక్కడకు వెళ్లి సాగు చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం గిరిజన రైతులు మాట్లాడుతూ సాగులో ఉన్న భూములను ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు అంటూ పెద్దల స్వార్థం కోసం మా పేదల భూములు లాక్కోవడం సమంజసం కాదని ఆందోళన వ్యక్తం చేశారు. చావనైనా చస్తాం.. కానీ భూములు వదిలే ప్రసక్తి లేదని గిరిజన రైతులు తేల్చి చేప్పేశారు. మాకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. సర్పంచ్ మజ్జి రాంబాబు మాట్లాడుతూ మిర్తివలస పంచాయతీ పరిధిలో ఉన్న సర్పంచ్‌గాని, గ్రామ ప్రజల సంతకాలు లేకుండా కొట్టక్కి రెవెన్యూ పరిధిలో ఉన్నంత మాత్రాన ఆ సర్పంచ్ సంతకంతో తీర్మానం ఎలా చేస్తారు? నోటిఫికేషన్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. గిరిజన రైతులకు న్యాయం జరిగే వరకు వారికి మద్దతుగా తాము నిలబడతామన్నారు. మండల సర్వేయర్ వి.సాయికుమార్, కొట్టక్కి వీఆర్వో మహేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురంలోని అరటి తోటలో చేరిన వర్షపు నీరు



పార్వతీపురంలో కురుస్తున్న వర్షం

జిల్లాలో గురువారం నమోదైన వర్షపాతం

మండలం	వర్షంపాతం (మిల్లీమీటర్లలో)
వీరఘట్టం	38.8
సీతంపేట	37.4
భామిని	24.8
పాలకొండ	34.6
కొమరాడ	8.4
గుమ్మలక్ష్మీపురం	10.2
కురుపాం	12.4
జియ్యమ్మలస	9.2
గరుగుబిల్లి	12.4
పార్వతీపురం	10.8
మక్కువ	2.6
సీతానగరం	14.2
బలిజిపేట	7.2
సాలూరు	1.6
పాచిపెంట	1.2

విస్తారంగా కురుస్తున్న వర్షాలు

పార్వతీపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా గురువారం వర్షాలు కురిశాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. చెరువులు, పంట పొలాల్లో నీరు చేరింది. వరి ఉభాలకు వర్షాలు అనుకూలమని రైతులు చెబుతున్నారు. జిల్లాలో 224.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. తోటపల్లి ప్రాజెక్టులో 2వేల క్యూసెక్కుల నీరు చేరుతుండగా, అధికారులు ఒక గేటు ఎత్తివేసి నాగావళి నదిలో తిరిగి 2,500 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు.